బుధవారం 02-10-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 473 పేజీలు: 4 | ₹6

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

EPAPER.MUNDADUGU.COM

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచేయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com



బస్సుమంటల్లో 25 మంది చిన్నారులు మృతి

మిగతా 2లో



మహిళలను ఎందుకు సన్యాసినులుగా మారుస్తున్నారు

మిగతా 3లో



మళ్లీ ఆందోళనలో కోల్‌కతా డాక్టర్లు

మిగతా 3లో



నిజాయితీని బతికిస్తున్నారు

మిగతా 5లో



## అక్రమంగా ఏ ప్రార్థనా మందిరమైనా కూల్చండి

### ప్రజల సురక్షితమే అత్యున్నత అంశం

### సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

**ముందడుగు జాతీయం:**

దేశంలో ప్రజల సురక్షితమే అత్యున్నత అంశమని.. రోడ్లు, జలాశయాలు, రైలు ట్రాక్‌లను ఆక్రమించిన ఏ మత సంబంధ కట్టడాలనైనా తొలగించాల్సిందేనని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. నేరగాళ్ల ఇళ్లపై బుల్డోజర్ చర్యలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను మంగళవారం జస్టిస్ బీఆర్ గవయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్ నేతృత్వంలోని బెంచి విచారించింది. భారత్ సెక్యూలర్ దేశమని.. ఆక్రమణల తొలగింపు, బుల్డోజర్‌తో చర్యలు మతాలతో సంబంధం లేకుండా అందరికీ ఒక్కటేనని బెంచ్ పేర్కొంది. మిగతా 2లో

### వికసిత్ భారత్ లక్ష్యం

## సాధ్యం కాదు

### ప్రజల భాగస్వామ్యం చాలా కీలకం

### కాగ్ ఆడిటర్ జనరల్ గిరీశ్ చంద్ర ముర్ము



**ముందడుగు జాతీయం:**

దేశంలో వికసిత్ భారత్ లక్ష్యం చేరుకోవడం సాధ్యం కాదని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ గిరీశ్ చంద్ర ముర్ము పేర్కొన్నారు. 2047 నాటికి దేశం అభివృద్ధి చెందిన దేశంగా అవతరించడంలో గ్రామీణ భారతం కీలకమని వ్యాఖ్యానించారు. సమాఖ్య వ్యవస్థలో అధికార వికేంద్రీకరణ ఇంకా పూర్తి స్థాయిలో జరగలేదని, గ్రామ సభలు, స్థానిక సంస్థలకు ఇంకా తగిన గుర్తింపు లభించడం లేదని చెప్పారు. "క్షేత్ర స్థాయిలో అభివృద్ధి జరగకుండా.. వికసిత్ బారత్ లక్ష్యాన్ని చేరుకోవడం సులువు కాదు. దేశంలోని 50 శాతం జనాభా ఇప్పటికీ మిగతా 2లో

### హైదరాబాద్‌లో

## ఇకపై డీజేలు బంద్

### సీపీ సీవీ ఆనంద్ ఉత్తర్వులు జారీ

**ముందడుగు హైదరాబాద్:**



హైదరాబాద్ నగరంలో ఊరేగింపులు, వేడుకల సందర్భంగా విపరీత శబ్ద కాలుష్యానికి దారితీస్తున్న డీజేలపై నగర పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. డీజే సౌండ్ కారణంగా ఇబ్బందులు మిగతా 2లో

### లక్షలాది మందికి

## నిద్రలేకుండా చేస్తున్నారు

### మూసీ పేరుతో రోడ్డున పడేసే ప్రయత్నం

### బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్

**ముందడుగు హైదరాబాద్:**



తెలంగాణ రాష్ట్రంలోని పేదలకు ఇబ్బందులు రాకూడదనే గతంలో మూసీకి సంబంధించిన ప్రాజెక్టులను నిలిపివేశామని బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. ప్రస్తుతం మూసీ సుందరీకరణ మిగతా 2లో

ముందడుగు
బుధవారం,
02-10-2024,
హైదరాబాద్

# అక్రమంగా ఏ ప్రార్థనా మందిరమైనా కూల్చండి

(మొదటిపేజీ తరువాయి)

యూపీ, గుజరాత్, మధ్యప్రదేశ్ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు హాజరయ్యారు. ఏదైనా నేరంలో ఉండటమే వ్యక్తి ఇంటిపై బుల్డోజర్ చర్యలు తీసుకోవడానికి ఆధారమా..? అని ఆయన్ను బెంచ్ ప్రశ్నించింది. దీనికి మెహతా స్పందిస్తూ.. "కచ్చితంగా కాదు. అత్యాచారం, ఉగ్రవాదం వంటి నేరాల్లో నిందితులైనా సంబంధం లేదు. ఒక్కరోజు ముందు నోటీసు జారీ చేసి ఇంటి గోడపై అంటించినా పరిగణలోకి తీసుకోం. ఇది ముందే జరిగిఉంటేనే చర్యలు తీసుకొంటాం" అని పేర్కొన్నారు. ఒక వర్గానికి సంబంధించిన కొన్ని ఘటనల ఆధారంగా న్యాయస్థానం మార్గదర్శకాలు జారీచేసిందని తాను ఆందోళన చెందుతున్నట్లు ఆయన వెల్లడించారు.

దీనిపై న్యాయస్థానం స్పందిస్తూ.. "మనది సెక్యూలర్ దేశం. మా మార్గదర్శకాలు జాతిమతాలతో సంబంధం లేకుండా అందరికీ వర్తిస్తాయి. ఇక ఆక్రమణల విషయానికి వస్తే మేము ఇప్పటికే చెప్పాం. ఏదైనా మత సంబంధమైన నిర్మాణం రోడ్డు, ఫుట్‌పాత్, జలాశయం, రైలు పట్టాపై ఉంటే అది ప్రజలకు అడ్డంకి కాదా. అక్రమ నిర్మాణాల విషయంలో అందరికీ ఒక్కటే చట్టం" అని వ్యాఖ్యానించింది.

# లక్షలాది మందికి నిద్రలేకుండా చేస్తున్నారు

(మొదటిపేజీ తరువాయి)

ప్రాజెక్టుతో సుమారు 2లక్షల మందిని రోడ్డున పడేసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. హైదరాబాద్‌లోని అంబర్‌పేట పరిధిలో మూసీ పరివాహక ప్రాంతాల్లో పార్టీ నేతలతో కలిసి ఆయన పర్యటించారు. పలువురు బాధితులను పరామర్శించి వారితో మాట్లాడారు.



హైదరాబాద్‌లో బిఆర్‌ఎస్‌కు ఓట్లు వేసిన వారిపై సీఎం రేవంత్‌రెడ్డి పగబట్టారని.. లక్షలాది మందికి నిద్రలేకుండా చేస్తున్నారని విమర్శించారు. ఎప్పుడు ఇళ్లు కూల్చుతారోనని ప్రజలు ఆవేదనతో ఉన్నారని చెప్పారు. ఇళ్ల వద్దకు బుల్డోజర్లు వస్తే కంచెలు పెట్టాలన్నారు. రేవంత్‌రెడ్డి, కిషన్‌రెడ్డి కూడబలుక్కున్నారా? అని ప్రశ్నించారు. పేదల ఇళ్లు కూల్చుతుంటే ఈ ప్రాంత ఎంపీ ఎక్కడికి వెళ్లారని పరోక్షంగా కిషన్‌రెడ్డిని ఉద్దేశించి అన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో సగం డబ్బుతో మూసీ ప్రక్షాళన చేపట్టారన్నారు. బాధితులకు భరోసా అండగా ఉంటుందని చెప్పారు. అంబర్‌పేటలో కేటీఆర్ కాన్వాయ్‌ను యూత్ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు అడ్డుకున్నారు. మంత్రి కొండా సురేఖకు వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. నిరసనకారులను పోలీసులు చెదరగొట్టారు.

# వికసిత్ భారత్ లక్ష్యం సాధ్యం కాదు

(మొదటిపేజీ తరువాయి)

గ్రామీణ ప్రాంతాల్లోనే నివసిస్తోంది. ప్రభుత్వ పాలన, వారి అభివృద్ధి, వారి పాలనాధికారాలు, వారికి తగిన వనరులు అందించకుండా.. అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలన్న లక్ష్యం అందుకోవడం సాధ్యం కాదు. మన ప్రధాని చెప్పినట్లు ఒక్కొక్కరూ ఒక్కో అడుగు వేస్తే 140 కోట్ల అడుగులు అవుతాయి. అందుకే ప్రజల భాగస్వామ్యం చాలా కీలకం" అని కాగ్ అన్నారు. దేశంలో 2.60 లక్షల పంచాయతీలు, 7 వేల స్థానిక సంస్థలు ఉన్నాయని గిరీశ్ చంద్ర ముర్ము అన్నారు. స్థానిక సంస్థలను సమర్థంగా తీర్చిదిద్ది ప్రభుత్వ పథకాలు అందేలా చూడడం అనేది దేశానికి చాలా మంచిదని చెప్పారు. స్థానిక సంస్థలను బలోపేతం చేయకుండా సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరుకోవడం సాధ్యం కాదన్నారు. స్థానిక సంస్థలకు వెళ్లే నిధుల విషయంలో అకౌంటింగ్, ఆడిటింగ్‌ది కీలక భూమిక అని పేర్కొన్నారు. కాబట్టి సరైన అకౌంటింగ్ విధానాలను పాటించని మున్సిపల్ కార్పొరేషన్‌లకు నిధులు సమీకరించే అనుమతులు ఇవ్వకూడదని చెప్పారు. స్థానిక సంస్థలు సరైన అకౌంటింగ్, ఆడిట్ విధానాలు పాటించేలా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపై కూడా ఉందన్నారు.



# బస్సుమంటల్లో 25 మంది చిన్నారులు మృతి

## థాయ్‌ల్యాండ్ బ్యాంకాక్‌లో ఘోర అగ్నిప్రమాదం

ముందడుగు జాతీయం:

థాయ్‌ల్యాండ్ బ్యాంకాక్‌లో పాఠశాల విద్యార్థులు, వారి టీచర్‌ను తీసుకెళుతున్న ఓ బస్సు మంటల్లో చిక్కుకొంది. సెంట్రల్ ఉతాయ్ థాని ప్రావిన్స్ నుంచి తిరిగివస్తుండగా జరిగిన ఈ ఘటనలో మొత్తం 25మంది చనిపోయి ఉంటారని భావిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో మొత్తం 44 మంది ప్రయాణిస్తున్నారు. థాయ్‌ల్యాండ్ ప్రధాని పేటోంగ్టార్న్ షినవత్రా మృతులకు సంతాపం తెలిపారు. విద్యార్థులు ట్రిప్‌కు వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకొంది. థాయ్‌ల్యాండ్ రవాణశాఖా మంత్రి ఈ ప్రమాదం వివరాలను వెల్లడించింది. "మొత్తం 44 మంది బస్సులో ప్రయాణిస్తున్నట్లు తెలిసింది. వీరిలో 38 మంది విద్యార్థులు, ఆరుగురు టీచర్లు ఉన్నారు. ఇప్పటివరకు 16 మంది విద్యార్థులు, ముగ్గురు టీచర్లను రక్షించారు. మిగిలిన వారి విషయంపై ఇంకా స్పష్టత లేదు" అని పేర్కొన్నారు. ఇటీరియర్ మంత్రి అనుతిన్ చర్నవిరకుల్ మాట్లాడుతూ మృతుల సంఖ్యను ఇంకా ధ్రువీకరించలేమని పేర్కొన్నారు. ఘటనా స్థలంలో దర్యాప్తు ఇంకా పూర్తి కాలేదన్నారు. ప్రమాదం నుంచి బయటపడిన వారి సంఖ్య ఆధారంగా.. 25 మంది చనిపోయి ఉండొచ్చన్నారు. ప్రమాదం జరిగి గంటలు గడుస్తున్నా.. మృతదేహాలు ఇంకా బస్సులోనే ఉండిపోవడం గమనార్హం.

# హైదరాబాద్‌లో ఇకపై డీజేలు బంద్

(మొదటిపేజీ తరువాయి)

పడుతున్నామని డయిల్ 100కు ఫిర్యాదులు పెరగడంతో డీజేలపై నిషేధం విధిస్తూ పోలీసు శాఖ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. డీజేల అంశంపై ఇటీవల బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నగర కొత్వాల్ సీవీ ఆనంద్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. బల్దియా కమిషనర్ ఆమ్రపాలి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, రాజాసింగ్, పాషాఖాద్రీ, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, రాచకొండ సీపీ సుధీర్‌బాబు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. సీవీ ఆనంద్ డీజేలపై నియంత్రణ అవసరాన్ని వివరిస్తూ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రెండేళ్లుగా డీజేలతో పెద్దయెత్తున నిబంధనల ఉల్లంఘన జరుగుతోందని, ఈసారి శృతిమించి జరిగిందని, సీఎం రేవంత్‌రెడ్డి సైతం దీన్ని గమనించి ఆరా తీశారని సీవీ ఆనంద్ అన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఇక నుంచి చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, పాషాఖాద్రీ.. డీజేల నిషేధానికి మద్దతు ఇస్తున్నట్లు స్పష్టం చేశారు.

ముందడుగు
బుధవారం, 02-10-2024, హైదరాబాద్

## మళ్లీ ఆందోళనలో కోల్‌కతా డాక్టర్లు

### ప్రభుత్వం నుంచి సానుకూల వైఖరి లేదని ఆరోపణ




**ముందడుగు పశ్చిమబెంగాల్:**

జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటనకు సంబంధించి జూనియర్ వైద్యులు మంగళవారం తిరిగి ఆందోళనలు చేపట్టారు. తమ భద్రతపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి సానుకూల వైఖరి కనిపించడం లేదని వారు ఆరోపించారు. 'మా భద్రతకు సంబంధించిన డిమాండ్లను నెరవేర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి సానుకూల వైఖరి కనిపించడం లేదు. సీఎం మమతా బెనర్జీ చర్చల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి ప్రయత్నాలు చేయడం లేదు. విధులకు శాశ్వతంగా విరమణ తెలిపి ఆందోళనలు కొనసాగించాలని నిర్ణయించాం' అని ఓ డాక్టర్ పేర్కొన్నారు. అదేవిధంగా తమ డిమాండ్లపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోకపోతే ఇది పూర్తిస్థాయిలో కొనసాగుతోందని ఆయన వెల్లడించారు. సెంట్రల్ కోల్‌కతాలోని స్క్వేర్ కళాశాల నుంచి ధర్మతల వరకు బుధవారం జూనియర్ వైద్యులు మార్చ్‌కు పిలుపునిచ్చారు. తమతో పాటు ఈ మార్చ్‌లో పాల్గొనాలని ప్రజలను కోరారు.



## మహిళలను ఎందుకు సన్యాసినులుగా మారుస్తున్నారు

### జగ్గీ వాసుదేవ్‌ను ప్రశ్నించిన మద్రాస్ హైకోర్టు

**ముందడుగు మద్రాస్:**

మహిళలను ఎందుకు సన్యాసినులుగా మారేలా ప్రేరేపిస్తున్నారని మద్రాస్ హైకోర్టు ఆధ్యాత్మిక గురువు సద్గురు జగ్జీ వాసుదేవ్‌ను ప్రశ్నించింది. ఓ కేసులో కోర్టు ఆ ప్రశ్న వేసింది. తన స్వంత కూతురి పెళ్లి చేసిన సద్గురు, ఎందుకు ఇతర అమ్మాయిలను సన్యాసం వైపు మళ్లిస్తున్నారని కోర్టు ప్రశ్నించింది. జస్టిస్ ఎస్ఎం సుబ్రమణియం, వీ శివజ్ఞానంతో కూడిన ధర్మాసనం ఈ ప్రశ్నలు వేసింది. తన ఇద్దరు కూతుళ్లను సద్గురు బ్రెయిన్‌వాష్ చేశారని, వాళ్లు పర్మనెంట్‌గా ఈషా యోగా సెంటర్‌లోనే ఉంటున్నారని ఓ రిటైర్డ్ ప్రొఫెసర్ ఈషా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జగ్గీపై కేసు ఫైల్ చేశారు.

కోయంబత్తూరులోని తమిళనాడు అగ్రికల్చర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎస్ కామరాజ్ ఆ కేసు ఫైల్ చేశారు. 42, 39 ఏళ్లు ఉన్న ఇద్దరు మహిళలు ఆ కేసులో ఇవాళ కోర్టు ముందు హాజరయ్యారు. అయితే తమ ఇష్ట ప్రకారమే ఈషా ఫౌండేషన్‌లో ఉంటున్నట్లు చెప్పారు. తమను ఎవరూ బంధించలేదని చెప్పారు. కూతుళ్లు వదిలి వెళ్లడం వల్ల తమ జీవితం దుర్భరమైనట్లు ఆ పేరెంట్స్ కోర్టుకు వెల్లడించారు. అయితే ఈ కేసులో మరింత లోతుగా విచారణ చేపట్టాలని జడ్జీ సూచించారు. ఈషా ఫౌండేషన్‌తో లింకున్న అన్ని కేసులను లిస్టు చేయాలని పోలీసులకు ఆదేశాలిచ్చారు. తన కూతురుకు పెళ్లి చేసి, జీవితంలో సెటిలయ్యేలా చేశారని, కానీ ఇతరుల కూతుళ్లను మాత్రం సన్యాసుల్లా జీవించేలా ప్రేరేపిస్తున్న సద్గురు ఎందుకు అలా చేస్తున్నారో తెలుసుకోవాలని ఉందని జస్టిస్ శివజ్ఞానం తెలిపారు. స్వచ్ఛందంగా ఉండేందుకు మహిళలు నిర్ణయించినట్లు ఈషా ఫౌండేషన్ తెలిపింది.

## శ్రీశైలం దసరా మహోత్సవాలకు ఆహ్వానం



**ముందడుగు శ్రీశైలం:**

శ్రీశైల మహా క్షేత్రంలో అక్టోబర్ 3 నుండి 12వ తేదీ వరకు దసరా మహోత్సవాలు ఎంతో వైభవంగా జరగనున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక శ్రీశైలం నియోజకవర్గం శాసనసభ్యులు బుడ్డా రాజశేఖర్ రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేసి ఉత్సవాలకు ఆహ్వానించడం జరిగింది. ఆలయ కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు, అర్చకస్వాములు, వేద పండితులు వేల్పనూరు నందు శాసనసభ్యుల వారిని కలిసి శ్రీశైలంలో జరిగే దసరా మహోత్సవాలకు ఆహ్వానించారు. వారితో పాటు దసరా మహోత్సవాలకు రోడ్లు, భవనాలు మరియు మౌలిక సదుపాయాల మంత్రివర్యులు బి.సి.జనార్ధన్‌రెడ్డికి బనగానపల్లిలో ఆహ్వాన పత్రికను అందజేసి,స్వామివార్ల శేషవస్త్రం, ప్రసాదాలను అందజేశారు.

## నవరాత్రి ఉత్సవ్ పోస్టర్ ఆవిష్కరించిన నటుడు సన్నీ

**ముందడుగు హైదరాబాద్:**

ప్రిజం అవుట్‌డోర్స్, ఆల్వేస్ ఈవెంట్స్ సహకారంతో, 2024 అక్టోబర్ 3వ తేదీ నుండి అక్టోబర్ 12వ తేదీ వరకు హైదరాబాద్‌లోని నోవోటెల్‌లో ప్రిజం నవరాత్రి ఉత్సవ్" పేరుతో జరగనున్న నవరాత్రి ఉత్సవాల సంబరాలకు రంగం సిద్ధమైంది. ఈ వైబ్రెంట్ వేడుకకు సంబంధించిన కర్టెన్ రైజర్ ఈవెంట్ అక్టోబర్ 1 నా నోవోటెల్ లాన్ ఏరియాలో జరిగింది, ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా వచ్చిన నటుడు మరియు బిగ్ బాస్ ఫేమ్ సన్నీ, ప్రిజం క్లబ్ వ్యవస్థాపకుడు ప్రణీత్ గౌడ్, ఆల్వేస్ ఈవెంట్స్ వ్యవస్థాపకుడు పి. సుమంత్, పునీత్



అగర్వాల్ మరియు కడివేలు సాయితో కలిసి "ప్రిజం నవరాత్రి ఉత్సవ్ 2024" పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిజమ్ క్లబ్ వ్యవస్థాపకుడు ప్రణీత్‌గౌడ్ మాట్లాడుతూ హైదరాబాద్‌లోని చైతన్యవంతమైన శక్తి, సుసంపన్నమైన సాంస్కృతిక సంప్రదాయాలతో నగరాన్ని ఆకట్టుకునేలా 'ప్రిజమ్ నవరాత్రి ఉత్సవ్' ఉండబోతుందన్నారు. మరింత సమాచారం మరియు టిక్కెట్ బుకింగ్‌ల కోసం 8143789528 లేదా 9948089528 పై సంప్రదించగలరు.

ముందడుగు
బుధవారం, 02-10-2024, హైదరాబాద్

## జూనియర్ క్విజ్ విజేతలను ప్రకటించిన హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో




ముందడుగు హైదరాబాద్:

భారతదేశంలోని ప్రముఖ ప్రైవేట్ రంగ సాధారణ బీమా సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ తన **22**వ వ్యవస్థాపక దినోత్సవం రోజున ముంబయిలో ఇన్సూరెన్స్ అవేర్‌నెస్ అవార్డ్ జూనియర్ క్విజ్ **2024**కు సంబంధించిన **9**వ ఎడిషన్ గ్రాండ్ ఫినాలేను నిర్వహించింది. ఫినాలే ఆరు జట్ల మధ్య విజ్ఞాన యుద్ధానికి సాక్ష్యంగా నిలవగా, ఈ ఏడాది వడోదరలోని న్యూ ఎరా సీనియర్ సెకండరీ స్కూల్ విద్యార్థులు నిర్మయ్ పటేల్ మరియు శౌర్య బెనర్జీ విజేతలుగా నిలిచారు. ఈ ఏడాది **3,200** పాఠశాలల విద్యార్థులు పోటీలో పాల్గొన్నారు. వారికి గట్టి పోటీనిస్తూ చెన్నైలోని ఎంసీఎం మెట్రిక్యులేషన్ హయ్యర్ సెకండరీ స్కూల్ మరియు జైపూర్‌లోని కేంబ్రిడ్జ్ కోర్ట్ హైస్కూల్ వరుసగా ప్రశంసనీయమైన మొదటి మరియు రెండవ రన్నరప్ స్థానాలను పొందాయి.

ఈ ఏడాది క్విజ్ ప్రధాన థీమ్ 'బౌండనింగ్ బౌండరీస్ – భారతదేశ వ్యాప్తంగా బీమా అవగాహన'. ఈ ఆలోచనకు అనుగుణంగా, కంపెనీ విభిన్న భౌగోళికాలు మరియు జనాభాకు చేరువైంది. వారి సామాజిక, ఆర్థిక నేపథ్యాలతో సంబంధం లేకుండా ఈ జాతీయ స్థాయి క్విజ్‌లో పాల్గొనేందుకు విద్యార్థులకు సమాన అవకాశాన్ని కల్పించింది.




## సింపోలో టైల్స్ & బాత్‌వేర్ విప్లవాత్మక కొత్త సేకరణలను ఆవిష్కరణ

ముందడుగు హైదరాబాద్:

సిరామిక్స్ మరియు సర్ఫేస్ డిజైన్ పరిశ్రమలో అగ్రగామిగా ఉన్న సింపోలో టైల్స్ & బాత్‌వేర్, కొచ్చిన్‌లో ఎంతో ఆసక్తిగా ఎదురుచూసిన ప్రోడక్ట్ లాంచ్ ఈవెంట్, పెర్స్‌పెక్టివ్**2025**ని విజయవంతంగా నిర్వహించింది. ఈ ఈవెంట్‌లో భారతదేశం అంతటా **400+** ప్రీమియం డీలర్‌లు మరియు కేరళ అంతటా **100+** కంటే ఎక్కువ మంది ప్రముఖ ఆర్కిటెక్ట్‌లు పాల్గొన్నారు, ఆధునిక నిర్మాణం మరియు డిజైన్ యొక్క అభివృద్ధి చెందుతున్న అవసరాలను తీర్చడానికి రూపొందించిన సింపోలో యొక్క తాజా అత్యాధునిక సేకరణలు మరియు ఉపరితలాల ఆవిష్కరణను చూసేందుకు వారు సమావేశమయ్యారు.

ఈ సంవత్సరం థీమ్, "ఫ్రెష్ ఫ్రమ్ ది పాస్ట్", సేకరణలకు టోన్ సెట్ చేసింది, ఇది ఆధునిక కార్యాచరణతో చారిత్రక అంశాలను సజావుగా మిళితం చేసింది. ఈవెంట్ యొక్క హైలైట్ కొత్త పోష్+ ఉపరితల పరిచయం, సింపోలో యొక్క ఐకానిక్ పోష్ ఉపరితలానికి ఒక వినూత్న అప్‌గ్రేడ్, అధిక ట్రాఫిక్ ఉన్న పబ్లిక్ ప్రదేశాల కోసం ప్రత్యేకంగా రూపొందించబడింది.

## గోవిందాకు బుల్లెట్ గాయాలు



ముందడుగు

ప్రమాదవశాత్తు తుపాకీ పేలిన ఘటనలో బాలీవుడ్ నటుడు గోవిందా తీవ్రంగా గాయపడ్డారు. మంగళవారం ఉదయం ముంబయిలోని ఆయన స్వగృహంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. లైసెన్స్‌డ్ రివాల్వర్‌ను కప్‌బోర్డ్‌లో పెడుతుండగా ట్రిగ్గర్ ప్రెస్ కావడంతో బుల్లెట్ మెకాలిలోకి దూసుకెళ్లింది. వెంటనే ఆయన్ని కుటుంబ సభ్యులు దగ్గరలోని క్రిటీ కేర్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు శస్త్ర చికిత్స చేసి బుల్లెట్‌ను తొలగించారు. ప్రస్తుతం గోవిందా ఆరోగ్యం నిలకడగా ఉందని, రెండు రోజుల్లో డిశ్చార్జ్ చేస్తామని వైద్యులు తెలిపారు. కోల్‌కతాలో జరిగే ఓ షోలో పాల్గొనేందుకు గోవిందా మంగళవారం నాలుగు గంటల సమయంలో ఇంటి నుంచి ఎయిర్‌పోర్ట్‌కు బయలుదేరేముందు, తన లైసెన్స్‌డ్ రివాల్వర్‌ను పరీక్షిస్తుండగా ఈ ఘటన జరిగిందని గోవిందా మేనేజర్ మీడియాకు తెలిపారు. 'తన్‌బదన్' (**1986**)చిత్రంతో బాలీవుడ్‌లో అరంగేట్రం చేసిన గోవిందా అనేక విజయవంతమైన చిత్రాల్లో నటించి కమర్షియల్ హీరోగా గుర్తింపు పొందారు. గత ఐదేళ్లుగా సినీ రంగానికి దూరంగా ఉంటున్నారు గోవిందా. లోక్‌సభ ఎన్నికలకు ముందు ఆయన శివసేన పార్టీలో చేరారు.

## ఒప్పో ఇండియా రెనో12 ప్రో లిమిటెడ్ ఎడిషన్ పరిచయం

ముందడుగు :

ఈ పండుగ సీజన్ ఒప్పో ఇండియా ఒప్పో రెనో**12** ప్రో **5**జీ మనీశ్ మల్హోత్రా లిమిటెడ్ ఎడిషన్‌ను ఆవిష్కరించింది. ఇది భారతదేశపు శక్తివంతమైన సంస్కృతిని, సంప్రదాయాలను ఆచరించుకునేందుకు సరైన స్మార్ట్‌ఫోన్. మనీష్ మల్హోత్రా ఐకానిక్ వరల్డ్ కలెక్షన్ నుంచి ప్రేరణ పొందిన ఈ ప్రత్యేక ఎడిషన్, సొగసైన బ్లాక్ బ్యాక్‌డ్రాప్‌లో క్లిష్టమైన గోల్డ్ ఫిలిగ్రీ మరియు పూల ఎంబ్రాయిడరీతో భారతీయ డిజైన్ వారసత్వ సంపదను ప్రతిబింబిస్తుంది. మల్హోత్రా సిగ్నేచర్ మోటిఫ్‌లతో ఒప్పో వినూత్న మెటీరియల్ డిజైన్ కలయిక భారతదేశంలోని పండగ స్ఫూర్తిని అద్భుతమైన వేడుకలో లగ్జరీ మరియు హస్తకళను మిళితం చేస్తుంది.



స్మార్ట్‌ఫోన్ బాడీ గ్రాఫిక్స్ భారతదేశంలోని గొప్ప కళాత్మక సంప్రదాయాల నుంచి తీసుకున్నారు. ముఖ్యంగా మొఘల్ కళ పూల మూలాంశాలు, రాజస్థాన్ మరియు ఉత్తర ప్రదేశ్ వంటి ప్రాంతాల నుండి క్లిష్టమైన ఎంబ్రాయిడరీ పద్ధతులు ఉందులో ఉన్నాయి.

## జార్‌తో కలసి డిజిటల్ గోల్డ్‌లో డైలీ సేవింగ్స్‌ను ప్రారంభించిన ఫోన్ పే

ముందడుగు హైదరాబాద్:

వినియోగదారులు ఇక రోజుకు ₹**10**తోనే **24K** డిజిటల్ గోల్డ్‌లో సులభంగా సేవ్ చేసుకోవచ్చు తమ ప్లాట్‌ఫారంలో 'డైలీ సేవింగ్స్' పేరుతో కొత్త ఉత్పత్తిని ప్రారంభించడం కోసం జార్ సంస్థతో భాగస్వామ్యం కుదుర్చుకున్నామని ఫోన్‌పే నేడు ప్రకటించింది. తద్వారా రోజురోజుకు పెంచుకునే డైలీ కంట్రిబ్యూషన్ల ద్వారా **24**కె డిజిటల్ గోల్డ్‌లో డబ్బును సేవ్ చేసుకోవచ్చు. డైలీ సేవింగ్స్ ద్వారా, యూజర్లు రోజుకు ₹**10**తో ప్రారంభించి, గరిష్ఠంగా ₹**5000** వరకు డిజిటల్ గోల్డ్‌లో పెట్టుబడి పెట్టవచ్చు.

ఇన్ యాప్, కన్స్యూమర్ పేమెంట్ల విభాగం నిహారికా సైగల్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, "గత కొన్నేళ్లుగా మా ప్లాట్‌ఫారంలో డిజిటల్ గోల్డ్ స్వీకరణలో గణనీయమైన పెరుగుదల కనిపిస్తోంది. **24**కె డిజిటల్ గోల్డ్ ద్వారా ప్రతిరోజూ ఎంతో కొంత సేవింగ్స్ చేయడానికి సౌకర్యం కల్పించేలా డైలీ సేవింగ్స్ ప్రారంభించడం మాకెంతో ఆనందంగా ఉంది. చిన్న మొత్తాన్ని నిలకడగా సేవింగ్స్ చేయడం ప్రారంభించడం ద్వారా, ప్రతి ఒక్కరూ తమ ఆర్థిక లక్ష్యాలను సాధించే దిశగా పురోగతి సాధించవచ్చు" అని అన్నారు.

ముందడుగు
బుధవారం, 02-10-2024, హైదరాబాద్

## స్కాలర్స్ విద్యాసంస్థలో
# బతుకమ్మ సంబరాలు



**ముందడుగు వరంగల్:**

బతుకమ్మ వేడుకలను స్కాలర్స్ విద్యాసంస్థలో విద్యార్థినిలు, ఉపాధ్యాయురాలులు వివిధ రకాల పూలతో బతుకమ్మలు పేర్చి ఆటపాటలతో సంబరాలు చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా స్కాలర్స్ విద్యా సంస్థ చైర్మన్ సంఘ వెంకట్రాజం, కరస్పాండెంట్ సంఘ జీవనజ్యోతి మాట్లాడుతూ ప్రపంచ దేశాలలో ఒక ప్రత్యేకమైనటువంటి గుర్తింపు ఉన్న ఈ బతుకమ్మ పండుగ ఉత్తర తెలంగాణలో జరుపుకోవడం చాలా గర్వకారణం అని ఈ పండుగ యొక్క ఔన్నత్యాన్ని మరియు తెలంగాణ సాంప్రదాయాన్ని విద్యార్థినిలకు నేటి తరం ఆడపడుచులకు అర్థం చేయించడానికి మా విద్యా సంస్థలోముందస్తుగా ఈ యొక్క కార్యక్రమం చేయడం జరిగిందని మరియు ఈ యొక్క బతుకమ్మ సంబరాల్లో చాలా సంతోషంగా విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొని వివిధ బతుకమ్మ పాటలతో సంబరాలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బతుకమ్మతో ముందడుగు
# సెల్ఫీ కాంటెస్ట్
## ఐదుగురు విజేతలకు బహుమతులు



**ముందడుగు హైదరాబాద్:**

ముందడుగు పౌండేషన్, సేవ్ ద గర్ల్ చైల్డ్ సంయుక్తంగా సద్దుల బతుకమ్మ ఉత్సవాల సంధర్భంగా మీ బతుకమ్మతో సెల్ఫీ కాంటెస్ట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

మీరు అందంగా ముస్తాబై మీరు అందంగా తీర్చిదిద్దిన, మీ బతుకమ్మతో సెల్ఫీ పంపండి. మీ బతుకమ్మతో మీరు పంపిన మీ సెల్ఫీలో మొదటి ఐదుగురిని ఎంపిక చేసి బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు డా. గాధిరాజు స్రవంతి, డా. ఇందిరా ప్రియదర్శిని, గీతానంద్, హేమ అన్నారు. అందమైన బతుకమ్మలతో విజేతలుగా నిలిచిన ఐదుగురు మహిళామణులకు ప్రముఖ సంగీత దర్శకులు ఆర్పీ పట్నాయక్, చంచల్‌గూడ జైలు ఎస్పీ శివకుమార్ చేతుల మీదుగా బహుమతులు అందిస్తామని తెలిపారు. మీరు మీ బతుకమ్మతో తీసుకున్న సెల్ఫీ ఫోటో **9491114616** నంబర్‌కు వాట్సప్ చేయాలని వారు కోరారు.



# నిజాయితీని బతికిస్తున్నారు

- ఆర్టీఐతో ప్రభుత్వాలను ప్రశ్నిస్తున్నారు
- తెలుగు రాష్ట్రాలలో వినూత్న కార్యక్రమాలు
- వినూత్నంగా యూత్ ఫర్ యాంటీ కరప్షన్



**ముందడుగు ప్రభుత్వం**

అవినీతి రహిత సమాజం కోసం యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ **2010**లో తమ కార్యకలాపాలు ప్రారంభించింది. అహింసే ప్రధాన ఆయుధంగా గాంధీజీ అడుగుజాడల్లో నడుస్తూ రెండు తెలుగు రాష్ట్రాలలో ఆలోచన రేకెత్తించే కార్యక్రమాలు చేస్తోంది. ప్రజలు, యువత వారికి సమస్యలు ఏర్పడినపుడు వాటిని శాంతియుతంగా ఏలా ప్రశ్నించాలి, వారి సమస్యకు ఏలా పరిష్కరించుకోవాలి అనే అంశాలపై అవగాహన కల్పిస్తోంది. అవినీతిని ప్రశ్నించడం ఎంత అవసరమో.. నిజాయితీగా పనిచేసే వారిని గుర్తించడం, సత్కరించడం అంతకన్నా ఎక్కువ అవసరం.. అందుకే యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ సమాచార హక్కు చట్టం ద్వారా అవినీతిని ప్రశ్నిస్తూ.. నిజాయితీగా పనిచేసే నాయకులను, అధికారులను గుర్తించి, సత్కరిస్తున్నారు.

### ఆకట్టుకునే రీతిలో సంస్థ కార్యక్రమాలు

సమాజంలో అందరూ చెడ్డవాళ్లు ఉండరు.. అలా అని అందరూ మంచివాళ్లు ఉండరు అనే ఆలోచనతో నిజాయితీగా పనిచేస్తున్న, పనిచేసిన అధికారులను, నాయకులను సత్కరిస్తున్నారు. వారిని సత్కరించడమే కాకుండా సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేసి నిజాయితీ పరుల సంఖ్యను పెరిగేలా చేస్తున్నారు. ఇలాంటి నిజాయితీ అధికారులను యువత ఆదర్శంగా తీసుకోవాలని చెపుతున్నారు. అందుకే ప్రతి సంవత్సరం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో నిజాయితీ ప్రభుత్వ అధికారులను, నిజాయితీగా గ్రామాభివృద్ధి కోసం పనిచేసిన సర్పంచులను, ఆదర్శంగా నిజాయితీ జీవనం సాగించిన ఎమ్మెల్యేలను సత్కరిస్తోంది. వాటితో పాటు వ్యవసాయాన్ని బతికించాలనే ఆలోచనతో యువ, వృద్ధ రైతులను ప్రోత్సాహించే కార్యక్రమాలు చేస్తోంది.



### మంచి సమాజం కోసమే వినూత్న ప్రయత్నం

“ప్రతి ఒక్కరూ నాకెందుకులే అనే నిరాశతో ఉంటారు. కాని ప్రతి సమస్యకు ఒక పరిష్కారం ఉంటుంది. ఆ పరిష్కారం కూడా శాంతియుతంగా ప్రశ్నిస్తూ ముందుకు సాగవచ్చు. అదే ఆలోచనను ప్రజలకు అలవాటు చేస్తున్నాం. అవినీతిని నీకు సాధ్యమైనంత వరకు ప్రశ్నించు.. అవినీతిని ప్రశ్నించడం ఎంత ముఖ్యమో.. నిజాయితీగా పనిచేస్తున్న అధికారులను, నాయకులను కూడా గుర్తించి వారికి భరోసా ఇవ్వాలి. ఆ భరోసా, ధైర్యం యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఇస్తోంది. నిజాయితీలో ఉన్న గొప్పదనాన్ని, వారి పనితనాన్ని పదిమందికి చాటిచెప్పేలా యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ వినూత్న కార్యక్రమాలతో, వినూత్న ఆలోచనలతో ముందడుగు వేస్తోంది.. కొత్త విధానాలు, కొత్త ఆలోచనలతో, మా సంస్థలో ఉన్న ఎంతోమంది మేధావులతో మరింత ముందుకు నడిచేలా ఎప్పటికప్పుడు కొత్త, కొత్త ప్రయత్నాలు చేయబోతున్నాం.”

- రాజేంద్ర పల్నాటి, పౌండర్, యూత్ ఫర్ యాంటీ కరప్షన్